
“అయితే రేపు తప్పకుండా వస్తావు కదా?” కళ లేచింది. మారుతి తలూపాడు.

కళ ‘వస్తాను’ అంటూ వ్యానిటీ బ్యాగ్ అందుకుంది. మారుతి ఆమెతో క్రిందకి వెళ్ళాడు. కారి




— చెల్లూరి సీతారాజేశ్వరరావు

డార్లో ఒక ఆటో వుంది. ఎంగేజ్‌డ్ అని చెప్పాడు.

మారుతి, కళ- హోటల్ ఆవరణ దాటి వచ్చారు. అక్కడ నాలుగైదు ఆటోలు వున్నాయి.

కళ ఎక్కి కూర్చున్నది.

"నేను కూడా రానా?" మర్యాద కోసం అన్నాడు.

"ఎందుకులే! రేపు తప్పకుండా రావాలి!" ఆటో బయలుదేరింది.

మారుతి రెస్టారెంట్ ముందు వున్న లాన్‌లో కాస్సేపు కూర్చున్నాడు. మనసంతా తెలియని సంతోషం.

ప్రొద్దుటనుంచి జరిగింది ఒక ఎత్తు-

సాయంత్రం కళ పరిచయం ఒక ఎత్తు.

మారుతి రెండో అంతస్థులోని గదికి వచ్చాడు. బయట రూం బాయ్ వున్నాడు. "సార్! మీల్స్ తీసుకురానా?"

మారుతికి సంతోషంలో ఆకలి తెలియడం లేదు, వేయడం లేదు. టైం చూసుకున్నాడు. తొమ్మిది న్నర.

భోజనమైతే పడుకోవచ్చును. తెమ్మన్నాడు.

మారుతిని ప్రముఖ చిత్రకారుడిగా గుర్తించి, నగరంలోని కళా కేళి సంస్థవారు అతడి చిత్రాల ఎగ్జిబిషన్, సన్మానం తలపెట్టారు.

భోజనం చేస్తూండగా మారుతికి సంభాషణంతర విశేషాలు జ్ఞాపకం వచ్చాయి. ఆటో గ్రాఫ్ కోసం చాలమంది చుట్టుముట్టారు.

"ఏది మీ పుస్తకం?" ఆఖర్న వున్న అమ్మాయిని అడిగాడు.

ఆమె చేతిలో పుస్తకం లేదు. నవ్వసాగింది. ఆమె ప్రవర్తన మారుతికి ఆశ్చర్యంగా కూడా వుంది.

"గుర్తుపట్టా వనుకున్నాను. లేదన్న మాట. కళంటే నీకు తెలియదు. జగన్నాథం మామయ్య కూతురంటే నీకు తెలుస్తుంది."

మారుతికి గుర్తు వచ్చింది. రెండు కుటుంబాల మధ్య వున్న వైరం కూడా గుర్తు వచ్చింది.

"బాగున్నావా?" తేరుకుంటూ అడిగాడు.

ఎగ్జిబిషన్ కార్యకర్తలు అక్కడికి వచ్చారు. మారుతి వాళ్ళతో మాట్లాడి వచ్చేసరికి గంటపైన పట్టింది.

కళ వెళ్ళిపోయి వుంటుంది అనుకున్నాడు.

కాని అక్కడే వుంది.

"రా...." ముందుకు నడిచాడు.

"హోటల్లో దిగావా?" కళ

అడిగింది.

"ఇంకా రేపు కూడా వుండాలి కదా! మరో చోట వుండటం నాకు యిబ్బందిగా వుంటుంది."

"ఫంక్షన్‌కి నాన్నగారు కూడా వచ్చారు. ఎవరో కబురు చేయడం వల్ల వెంటనే వెళ్ళిపోయారు. నిన్ను వచ్చేటప్పుడు తీసుకురమ్మన్నారు!"

మామయ్య మారిపోయాడా?

వైరం మరచి పోయాడా?

"రా బావా! చిక్కడపల్లి పది నిమిషాలు ప్రయాణం."

"నాకు చాల అలసటగా వుంది కళా! హోటల్‌కి పోయి మాట్లాడుకుందాం. రేపు తప్పకుండావస్తాను."

'ఎవరో ఒకరు దిగిరావాలి కదా?' కళ అంగీకరించింది.

రూంకి రాగానే టిఫిన్, కాఫీ తీసుకుని సంభాషణంలో చొరబడ్డారు.

కొత్తదనం కొంతసేపులో సెలవు తీసుకుంది.

"పల్లెటూర్లో కూర్చుని ఇన్ని మంచి చిత్రాలు ఎలా గీస్తున్నావు బావా?"

"పల్లెటూరు వాళ్ళు ఏం చేయకూడదనా?"

"చాల గొప్ప అర్థం తీశావులే!" కళకి ప్రాంతీయ భేదాలుండవు.

"అదేం లేదులే! నీ పేరు చాలా కాలంగా చూస్తున్నాను పత్రికలలో. కార్టూన్ల పోటీలో నీకు బహుమతి వచ్చినప్పుడు నీ ఫోటో వివరాలు ప్రచురించారు వీక్లీ వారు. అప్పుడు నీకో ఉత్తరం కూడ రాశాను. నువ్వు సమాధానం రాయలేదు గాని."

"అందితే ఎందుకు రాయను?"

"మన కుటుంబ తగాదాలు, ఆ పట్టింపులు నీకూ వున్నాయేమోనని మళ్ళీ ఉత్తరం రాయలేదు నీకు."

కుటుంబాల ప్రసక్తి రాగానే అతడి మనసు వికలమైపోంది. కళతో ఆ రకం ప్రసంగం చెయ్యడం అతడికి రుచించలేదు.

ఆమె తన వారిది తప్పులేదనవచ్చు.

తనకి- తన వారిది దోషమనిపించదు.

"అభిప్రాయభేదాలు, సమస్యలు రావడం తప్పనిసరి. కాని అర్థం చేసుకునే నైపుణ్యం వుంటే ఎలాంటి పరిస్థితినయినా దాటవచ్చు. ఆ తరం కంటె మనం ఎక్కువ విశాలహృదయం ప్రదర్శించవచ్చు" అంది కళ గంభీరంగా.

సోఫామీద కాళ్ళుపెట్టి సోఫా పైకి వంగి అలా కళ మాట్లాడటడం ఎంతో ముగ్ధంగా వుంది.

(మిగతా కథ 74వ పేజీలో)

(కల-వరించిన వేళ ………… 15వ పేజీ తరువాయి)

ఆమెకేసి కన్నార్పకుండా చూశాడు.

కళ కళగా వుంటుంది. వేకువ లోని మందారంలా వుంటుంది. బిస్కట్ కలర్ షిపాన్ చీర యవ్వనానికి మెరుగు పడుతోంది.

ఇంత అందాన్ని ఇంతకాలం ఎందుకు చూడలేక పోయాడు? కుటుంబాలమధ్య సయోధ్య వుంటే రాకపోకలుండేవి.

మారుతి తండ్రి చెంగయ్యకి, జగన్నాధంకి పొలాల దగ్గర స్పర్ధలు ఏర్పడ్డాయి. జగన్నాధం ఉద్యోగ రీత్యా దూరంగా వుండటం వల్ల అతడి పొలాలు కూడా చెంగయ్య చూసేవాడు. శిస్తు పంపించేవాడు. పొలం అమ్మకం విషయంలో తనని సంప్రదించకుండా చేసుకున్నాడని చెంగయ్యకి కినుక బయల్దేరింది. తర్వాత చుట్టపు చూపుగా జగన్నాధం వచ్చినా ఏం మాట్లాడలేదు చెంగయ్య.

రాను రాను స్పర్ధలు పెరిగాయి.

చెంగయ్య పోయినా చెల్లెల్ని పరామర్శించడానికి జగన్నాధం రాలేదు. రెండేళ్ళు పోయాక వచ్చి ఓ గంట ఉన్నాడు.

అంతే! అక్కణ్ణించి ఏ రాక పోకలు లేవు.

మారుతి-తండ్రి ఇచ్చిన ఇరవై ఎకరాలకి వారసుడు.బి.ఏ. ప్యాస యినా ఉద్యోగాల జోలికి పోకుండా వ్యవసాయం చూసుకుంటున్నాడు. చిత్రకళ హాబీ!

కళ వచ్చి వెళ్ళడంతోమారుతికి ఆ రాత్రి నిద్ర కరువైంది. ఎన్నో ఆలోచనలు. కళ ఇంటికి రమ్మని బలవంతపెడుతోంది. వెళితే అమ్మ ఏమనుకుంటుందో? కళ ఇలా రావడం మామయ్య అత్తయ్యలకి తెలియదేమో! వెళితే అవమానం ఎదురు కాదు కదా?

మారుతి లేచి కూర్చున్నాడు. ఆరూ-పది అయింది. నిద్రపట్టే లక్షణాలేం కనిపించలేదు.

షేవ్ చేసుకుని స్నానంచేసాడు. రూంబాయ్‌ని పిలిచి టిఫిన్ తెమ్మన్నాడు. వీలైనంత తొందరగా కళని చూడాలనిపిస్తోంది

ఉదయమే వెళితే బాగోదని ఆగిపోయాడు. కళ తన గురించి ఎదురు చూసి విసిగిపోవాలి. అప్పుడు వెళితే బాగుంటుంది.

సిగరెట్ కాలుస్తూ ట్రాన్సిస్టర్ లో వార్తలు వింటూ కూర్చున్నాడు. న్యూస్ పేపర్ తిరగేసి వదిలేశాడు. చదవ బుద్ధి కావడం లేదు.

తొమ్మిదింటికి రూం తాళంవేసి రిసెప్షన్‌లో ఇచ్చి బైటకి వచ్చాడు.

అబిడ్స్ దాకా నడచి సిటీ బస్ ఎక్కాడు.

ప్యాట్నీలో దిగి స్నేహితుడి గదికి వెళ్ళాడు. అతడు అప్పుడే వెళ్ళిపోయాడని తెలిసింది.

అక్కడ్నుంచి నేరుగా ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి వచ్చాడు. సెక్రటరీ సాదరంగా ఆహ్వానించాడు.

నలుగురైదుగురు అతడి చిత్రాలు కొన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ వారు 'సావనీర్' మారుతి చేత విడుదల చేయించారు.

"లంచ్ తీసుకుని వెళుదురు గాని!" అధ్యక్షుడు అన్నాడు.

మారుతికి నిలబడే ఓపిక కూడా లేదు. కళ దగ్గర వాలిపోవాలి! మన సంతా ఆత్రం!

"సారీ! మరోసారి కల్సుకుందాం!"

తన చిత్రకళకి వారు చూపించిన ఆదరాభిమానాలకి ధన్యవాదాలు చెప్పుకుని మారుతి బయలుదేరాడు.

"రండి కోఠీమీంచి వెళుతున్నాను" అధ్యక్షుడు మారుతిని ఆహ్వానించాడు-కారు స్టార్టు చేస్తూ.

హరిద్వార్ దగ్గర ఆపుతూ, "ఎక్కడికీ పోనీయమంటారు?" అన్నాడు.

"ఇక్కడ ఆపు చేసెయ్యండి. చాలు" దిగిపోతూ అన్నాడు మారుతి. ఆయన్ని శ్రమపెట్టడం ఇష్టం లేక.

ఆటో ఎక్కుతూ కళ యిచ్చిన ఎడ్రస్ గుర్తు చేసుకున్నాడు.

ఇల్లు గుర్తుపట్టడం సులభమే అయింది. పైగా గేటు దగ్గర కళ వుంది.

"నా కోసమే నించున్నావా?"

"కళాకారులకి పరధ్యాన్నం ఎక్కువ కదా?"

రెండంతస్థుల మేడ. ఎదట పూల తోట చిన్నది వుంది. క్రింది భాగంలో ఎవరో అద్దెకి వున్నారు. కళ మేడ మెట్లు ఎక్కింది.

బాల్కనీలో జగన్నాధం ఎదురయ్యాడు. "మరచిపోయావేమో రావడం అనుకున్నాను."

"నువ్వు మరచిపోతావుగాని, నేను మరచిపోను."

"నన్నే దెబ్బ కొట్టావురా!"

"అలా జాడించు మీ మామయ్యని." బసుమతి ఫ్రిజ్‌లోని కూల్ వాటర్ యిస్తూ అన్నది.

"నిన్న ఫంక్షనులో నిన్ను కలుద్దామనుకున్నాను. ఇంతలో పీకల మీదకి పని ముంచుకు వచ్చింది!" జగన్నాధం సంజాయిషీగా అన్నాడు.

"కలసి వచ్చేదే అయి వుంటుంది."

జగన్నాథం ఇంజనీరింగ్ ఆఫీసులో గుమస్తా చేస్తూ సొమ్ము వెనకేసి, కాంట్రాక్టులు చేసి సొమ్ము గడించాడు. ఆర్జన పరుడయ్యాక అహం కూడా పెరిగింది.

మారుతి, తను పగ సాధించిన వాడి కొడుకు- ఇలా రావడం ఆయనకి సుతారామూ ఇష్టం లేదు.

కాని కళ బలవంతం.

ఏకైక పుత్రిక. ఆమె పుట్టినాక సిరి ఎత్తుకుందని అతడి సెంటిమెంటు. కళ కోరిక ఏదయినా తీర్చవల్సిందే!

భోజనాలయినాయి. రెండు కుటుంబాల వైషమ్యాల గురించి ఎత్తుతాదేమో అనుకున్నాడు మారుతి. జగన్నాథం, బసుమతిలో కాభిరామాయణం మించి పోలేదు.

వాళ్ళు ఒక పరిధిలోనే మాట్లాడటం గమనించాడు.

వారి లోటు కళ మాటల ద్వారా, సాన్నిహిత్యం ద్వారా పూడింది. ఒక్క నిముషం వదిలి పెట్టలేదు. మధ్యాహ్నం నిద్ర పోనివ్వలేదు కూడా. తను సంపాదించిన, జాగ్రత్త పరచిన అతడి బొమ్మలు చూపించింది. తన చదువు గురించి, స్నేహాల గురించి.... ఒకటేమిటి? అన్నీ లొడ లొడ వాగేసింది.

"ఇవాళ వుండు బావా?" కళ సాయంత్రం అతడు బయలుదేరుతూంటే అన్నది.

ఆమె తల్లి తండ్రులు అప్రసన్నంగా చూశారు.

"సాధ్యం కాదు! పని వుంది."

అతడితో క్రిందకి వచ్చింది.

"మళ్ళీ హైద్రాబాదు ఎప్పుడు వస్తావ్?"

ఏం ఐడియా లేకపోయినా, "త్వరలోనే!" అన్నాడు.

"వస్తావు కదూ? మరచి పోతావా?"

"అదేం లేదు."

"ఈ మధ్య నువ్వు గీసిన మంచి చిత్రం ఒకటి పంపు. ఉత్తరాలు రాస్తావు కదూ?"

మారుతి ఆటో ఎక్కాడు.

* * *

మారుతి ఇంటికి రాగానే తల్లితో మేనమామ ఇంటికి పోవడం చెప్పాడు. కమలమ్మ సంతోషించా లేదు. నిరశించా లేదు. ఉదాసీనంగా వూరుకుంది. తనకు సంబంధించిన వార్తలా కనిపించలేదు.

కళ నుంచి వారానికి నాలుగు వుత్తరాలయినా అందుతున్నాయి. అన్నీ సుదీర్ఘమైనవి. ఏ విషయం గురించయినా నేర్పుగా వుత్తరంలో యిరికించగలదు. ఎక్కువ భాగం

చిత్రాల గురించే వుండేది. కళ వుత్తరాలు చదవడం ఎంతో అనుభూతిగా ఉండేది.

రెండు నెలలు జరిగాయి. కళని చూడాలనిపించింది. హైద్రాబాద్ స్వయంగా, ఆ పని మీదే బయలుదేరాడు.

తీరా హోటల్లో దిగాక, తనంతట తాను వెళ్ళడమా అనిపించింది. తన రాక జగన్నాథం దంపతులకి ఎలా వుంటుంది?

ఆ సంశయం వల్ల కదలలేదు. నిద్ర పోయాడు. రెండు గంటలకి లేచి ఎటయినా తిరిగి రావడానికి బయలుదేరాడు.

అశోకాలో కాకతాళీయంగా కళ కనిపించింది.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు! నిస్తేజపడ్డారు.

"హఠాత్తుగా జరిగితే కొన్ని సంఘటనలు చాల బాగుంటాయి." మారుతి తేరుకుంటూ అన్నాడు.

"ఎప్పుడు వచ్చావు?"

ఎఫెక్టు కోసం, "వారం రోజులయింది" అన్నాడు.

"మైగాడ్! ఇన్ని రోజులై కూడా చూడడానికి రాలేదేం?" కోప్పడింది.

ఇంటికి రమ్మని బలవంతం చేసింది. మారుతి బెట్టు చేస్తూనే వెళ్ళాడు. జగన్నాథం కారిడార్లో పేపరు చూస్తున్నాడు. మేనల్లుడ్ని చూసి చేదుగా నవ్వాడు. అతడు రావడం యిష్టంలేనట్లు యిబ్బందిగా కదిలాడు. బసుమతి సాదాగా పల్కరించి క్లబ్‌కి వెళ్ళిపోయింది. వాతావరణం లోని మార్పు గమనించాడు.

కళ కోసం 'చాయ్' త్రాగుతూ ఓ గంటసేపు కూర్చున్నాడు. భోజనం చేస్తే గాని ఆమె వెళ్ళనివ్వలేదు.

మారుతి వెళ్ళాక జగన్నాథం నోరు విప్పాడు. బసుమతి పాన్ అందిస్తూ ప్రక్క కుర్చీలో కూర్చుంది.

"మళ్ళీ రాకపోకలు సాగిస్తున్నాడు మీ మేనల్లుడు?" బసుమతి వ్యంగ్యం.

"చూస్తున్నా. ఇలాంటివి మొగ్గలోనే త్రెంచి వేయాలి. మన సంపదమీద కన్నేశాడేమో చవట!"

నవల చదువుతున్న కళ కోపంగా దిగ్గున లేచి వెళ్ళింది. "మీరు బావని అపార్థం చేసుకుంటున్నారు. అతడికి మన మీద గొప్ప అభిప్రాయం ఉంది."

"ఈ నాటకాలకేంలే! వాడు తండ్రిలాగే మేకవన్నె పులి. అమ్మాయ్! వాడ్నిక యింటికి

రానిచ్చాడు. నీకు బ్రహ్మాండమైన సంబంధం చూశాను. అమెరికాలో వుంటున్నాడు. రేపో మాపో ఇండియా వస్తాడు."

విషయం చాల దూరం పోయిందని, పోతూందని- యిటువంటి సన్నివేశంలో మౌనం వహించడం నష్టమని కళకి తెలుసు. "బావని చేసుకుంటా——పెళ్ళి!"

ధైర్యంగా సూటిగా చెప్పింది.

తల్లిదండ్రులు నోరు వెళ్ళబెట్టారు. 'శాక్' వీల్లేదన్నారు. ఆగ్రహించారు. కళ లెక్కచేయలేదు.

రెండ్రోజులు అన్నం ముట్టుకోలేదు.

జగన్నాధం కరిగిపోయాడు. ముద్దుల కూతురికోసం అంతస్థు దిగివచ్చాడు. విరోధం నెరపిన చెల్లెలు యింటికి పోయి వియ్యం సంగతి మాట్లాడాడు. కమలమ్మ కూడా పాత పురాణాలు తవ్వలేదు. 'అంతా వాడిష్ట'మని తప్పుకుంది.

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది మారుతికి. ఇంతకంటె ఏం కావాలి? తనే ఎలా అడగాలా అని మీమాంస పడిపోతున్నాడు. ఆ బాధ తప్పింది. జగన్నాధం తాంబూలాలు పుచ్చుకుని కదిలాడు.

ముహూర్తం రెండు నెలల్లో దొరికింది.

మారుతి- కళ ఫోటో తీసుకుని ముద్దుల కురిపించాడు.

* * *

పెళ్ళి దగ్గర పడుతున్నది. కళ షాపింగ్‌కి బయలుదేరుతూండగా గేటు దగ్గర పోస్ట్‌మాన్ కవరు యిచ్చాడు.

ఆటో పిలిచి ఎక్కింది. ఆటో సర్వీస్ స్టేషన్ దగ్గర ఆగింది. కళ కవరు చింపి చూసింది.

ఉత్తరం, కొత్తగా గీసిన చిత్రం పంపించాడు మారుతి.

ఆటో డ్రయివర్ వస్తూ ఆమె చేతిలోని చిత్రం చూసి, "నా చిత్రం మీ దగ్గరికి ఎలా వచ్చింది?" అన్నాడు.

కళ విస్మయంగా చూసింది.

డ్రయివర్ తన బాగ్‌లో నుంచి సాదా కాగితం తీసి, పెన్సిల్‌తో అదే చిత్రం గీశాడు. కన్నెపిల్ల కాలువ మీద దుంగ వంతెన దాటే దృశ్యం.

"ఇప్పుడైనా నమ్ముతారా?" డ్రయివర్ నిలేశాడు.

"చూసి కొంత మంది గీస్తారు. గీయగలరు." కళకి నమ్మాలని వున్నా క్రాస్ చేసింది.

"మీరు నేను గీచిన వసంతుడి కొలువు, కన్యా సంక్రాంతి, పంట

చేనులో పడతి, వానా కాలం పల్లె-చూసే వుంటారు. బహుశా వాటిని జాగ్రత్త పెట్టే వుంటారు."

కళ విస్తుపోయింది. "అవి ప్రఖ్యాత చిత్రకారుడు మారుతి గీసినవి. మీ వంటారేమిటి?"

డ్రయివర్ పకపకా నవ్వాడు. క్లుప్తంగా చెప్పాడు.

"ఇడియట్! ఎంత దారుణం?" కళ పళ్ళు కొరికింది.

"మీ పేరు?"

"వాసు."

ఆటో బయలుదేరింది.

* * *

కళ టెలిగ్రాం చూసి వెంటనే హైద్రాబాదు బయలుదేరాడు మారుతి. హోటల్లో దిగకుండా మామయ్యగారింటి దగ్గరే దిగాడు.

కళ పెళ్ళికి వెళ్ళింది. సాయంత్రం కాని రాలేదు.

"నన్ను రమ్మని ఎక్కడికో వుడాయించేస్తావా?" కోపం తెచ్చుకుని అన్నాడు.

"సారీ!"

"అర్జంటుగా ఎందుకు రమ్మన్నావట? కంగారుపడ్డాను తెల్సా?"

"నా చిత్రం గీయాలి బావా? అర్జంట్. ఇప్పుడే- ఇక్కడే!"

"చూద్దాంలే! కుంచెలుండాలి గదా?"

"అన్నీ సిద్ధం" అల్మారాలోని తలుపు లాగింది. రంగులు, కుంచెలు, పెన్సిళ్ళు....చిత్రకారుల సరంజమా బయటపడింది.

భోం చేశాక అన్నాడు. భోజనమయ్యాక నిద్ర వస్తోందన్నాడు. టీపెట్టి ఇచ్చింది.

"రాత్రివేళ నిన్ను చూస్తూ కూర్చుంటే ఏదో చెయ్యబుద్ధి అవుతుంది." తప్పించుకోడానికి ఎత్తు వేశాడు.

"చేసెయ్! పెళ్ళికి తర్వాత జరిగేది ముందు జరుగుతుంది అంతే."

"పెళ్ళి అయ్యాక గీస్తాను కళా!"

కళా సీరియస్‌గా లేచింది. "నువ్వు చిత్రకారుడివి అయితేగా? నాటకమాడి జనాన్ని మోసం చేస్తున్నావు!"

"కళా!"

"నీ గుట్టు తెల్సింది. నీకు కుంచె పట్టుకోవడమే రాదు. అది ఇప్పుడు రుజువు కూడా అయింది. ఇంకా బుకాయించకు!"

కళ చప్పట్లు కొట్టింది. అతడు వచ్చాడు.

"వాసు నీకు తెల్సు కదూ?" కళ రెట్టించింది.

వాసుని చూడగానే మారుతి ముఖం వివర్ణమయిపోయింది.

వాసు అనాథ. రోడ్ల మీద బొమ్మలు గీసి ముష్టి ఎత్తుకునే వాడు. మారుతి అతడ్ని తన ఇంటికి తీసుకువచ్చి అన్ని సదుపాయాలు కలుగజేశాడు. వాసులోని కళా జిగీష నిద్ర లేచింది. రాత్రింబవళ్ళు ఏక దీక్షగా కూర్చుని కొన్ని వందల చిత్రాలు గీశాడు. ఇంతలో మారుతికి దుర్బుద్ధి పుట్టింది. ఓ మర్డర్ కేసులో వాసుని జైలుకి పంపి అతడి చిత్రాలని తనవిగా చలామణీ చేసుకున్నాడు.

"సిగ్గులేదూ-అరువు కీర్తి మీద బ్రతకడానికి? దేముడి దయవల్ల హత్యకేసు తిరగతోడటంవల్ల వాసు బయటకి వచ్చాడు. అతడు నీ మీద ఎలాంటి చర్యయినా తీసుకోవచ్చు. కాని దానివల్ల నీకు బుద్ధిరాదు. ఏం చేయాలో నాకు తెలుసు!" కళ ఆవేశంతో ఎగిరెగిరిపడుతోంది.

"సారీ కళా! ఆ నిజం నీకు చెబుదామనుకున్నాను." మారుతి నేల చూపులు చూశాడు,

"నీ ముఖానికి అంత నిజాయితీ ఎక్కడిది? అందుకే మన పెళ్ళి రద్దవుతోంది."

"ప్లీజ్ కళా! తొందరపడకు!"

"అంతేకాదు...." కళ తన వేలినున్న వుంగరాన్ని తీసి వాసుకి తొడిగింది- "నా జీవిత భాగస్వామి వాసుగారే!"

ఇద్దరూ కలవరపడ్డారు.

"కళ కళనే ప్రేమిం... ప్రేమిస్తుంది. నీ ముఖం ... ప్రేమించలేదు. నిన్ను చూడడానికి కూడ సిగ్గుగా వుంది పో." అరచింది.

దొంగతనం బయట పడటం కంటె. కళ తనను కాదని వాసుని ఎన్నుకోవడం దుర్భరమనిపించింది. కాని ఏం చెయ్యడానికి నైతికంగా బలం లేదు.

సూట్‌కేస్ సర్దుకొని మౌనంగా వెళ్ళిపోయాడు.

"ఆవేశం మీద నిర్ణయాలు తీసుకోరాదు!" వాసు అన్నాడు.

"మంచి నిర్ణయాలు మాత్రం తీసుకోవచ్చు."

కళ అతడి ఒడిలో వాలిపోయింది.

వాసుకు కలలా ఉంది. కళని కల వరించింది. మారుతిని కలవరపరిచింది! ఒకే దృశ్యం- మూడు ...వాలూ!

---

Edited & Published by VIJAYA BAPINEEDU
80, Dhanalaxmi Colony, Madras-600 026, and
Printed by him at Vijaya Graphics;
210, Arcot Road, Madras-600 026. Phone 422233

కథా సౌరభ్యం ... శ్రీకాకుళం